# ‘సీఎం బ్రేక్‌ఫాస్ట్’ బడిపిల్లల భవితకు వరం



మానకొండూర్‌లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి, సుడా చైర్మన్ జీవీఆర్

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- మానకొండూర్ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం కేసీఆర్ అల్పాహారం ప్రారంభం
- విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన ఎమ్మెల్యే

మానకొండూర్, అక్టోబర్ 6: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఉదయం అల్పాహారాన్ని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘ సీఎం బ్రేక్ ఫాస్ట్’ పథకం బడి పిల్లల భవితకు వరమని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ పిల్లల చదువుతోపాటు వారి శ్రేయస్సు గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ అందజేస్తున్న తెలంగాణ సర్కార్ ఇప్పుడు మానవీయ పథకమైన ‘సీఎం బ్రేక్ ఫాస్ట్’కు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థుల్లో పోష్టికాహార లోపాన్ని నిర్మూలించి, డ్రాపౌట్స్ సమస్య తగ్గించడంతోపాటు పిల్లల సామర్థ్యాన్ని మెరుగు పర్చడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహద పడుతాయని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే బ్రేక్‌ఫాస్ట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, జడ్పీ సీఈవో పవన్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో సబిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఇన్‌చార్జి ఎంఈవో రాజేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ‘ఇస్కాన్’ భూమిపూజకు తరలిరావాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య తదితరులు

తిమ్మాపూర్, అక్టోబర్ 6: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించి ఇస్కాన్ టెంపుల్ భూమి పూజకు యాదవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తిమ్మాపూర్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ చౌరస్తా నుంచి ఉజ్వల పార్క్ వరకు మధ్యాహ్నం నిర్వహించే శోభాయాత్రలో యాదవులు పాల్గొనాలని కోరారు . ఇక్కడ నాయకులు సందబోయిన ప్రసాద్‌యాదవ్, తమ్మనవేణి నర్సయ్య యాదవ్, గాలి రవి, ఆనంద్ యాదవ్ పాల్గొన్నారు.

## కేవైసీ కోసం డబ్బులు వసూలు

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 6:మండల కేంద్రంలోని రేషన్ డీలర్ ఆంజనేయులు కేవైసీ చేయడానికి డబ్బులు వసూలు చేస్తున్నారని తహసీల్దార్ భిక్షపతికి రేషన్ లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ రజిని శుక్రవారం రేషన్ షాపులో పంచనామా చేపట్టారు. ఈ నివేదికను ఆర్‌ఎస్‌వోతోపాటు ఆర్డీవోకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రేషన్ లబ్ధిదారుల నుంచి కేవైసీకి ఎలాంటి రుసుము వసూలు చేయవద్దని చెప్పారు. ఎవరైనా వసూలు చేస్తే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించడం సంతోషకరం

చిగురుమామిడి, అక్టోబర్ 6: ప్రభుత్వం మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గానికి సాగునీరందించడం సంతోషకరమని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరులతో వారు. మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ప్రజా ఉద్యమాలు చేపడుతుందని చెప్పారు. ఇక్కడ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెం లక్ష్మి, అందె స్వామి, బోయిని అశోక్, చాడ శ్రీధర్ రెడ్డి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, మండల నాయకుడు ఎలగందుల రాజయ్య, మండల మాజీ కార్యదర్శి తీరాల సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకోల రాజయ్య పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

గన్నేరువరం రూరల్, అక్టోబర్ 6: మండలంలోని రేషన్ డీలర్లు సమయ పాలన పాటించి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ భిక్షపతి ఆదేశించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో అన్ని రేషన్ షాపుల వెయిటింగ్ స్కేల్స్‌కు లీగల్ మెట్రాలజీ ఆధ్వర్యంలో వెయిటింగ్ స్కేల్ స్టాంపింగ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రజినీకుమార్, రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు బోడ ప్రతాప్‌రెడ్డి, ఈ పాస్ మెకానిక్ సిబ్బంది, డీలర్లు చింతల సంపత్, బిట్ల రమేశ్, శంకరాచారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, అక్టోబర్ 6: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నుస్తులాపూర్‌లో చోటుచేసుకుంది. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నుస్తులాపూర్ గ్రామానికి చెందిన ఆడెపు మానస (23)ను భర్త రఘు కొద్ది రోజులుగా వేధిస్తుండడంతో తల్లిగారింటి వద్ద ఉంటుంది. మానస తల్లి, తమ్ముడు పనుల కోసం ముంబై వెళ్లారు. ఈ క్రమంలో రఘు ఫోన్ చేసి మళ్లీ వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె మధ్యాహ్నం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మానస తండ్రి మల్లేశం ఇంటికి వచ్చి చూసేసరికి కూతురు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో విలపించాడు. మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# బాధితులకు అండగా సీఎంఆర్‌ఎఫ్

- మండలి విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ శాసన సభ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



4వ వార్డులో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్; అక్టోబర్ 6: పేదవర్గాల వారు ప్రైవేట్ దవాఖానాల్లో చికిత్స చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని.. అలాంటి వారికి సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక వెసులుబాటు కల్పిస్తుందని ముఖ్యమంత్రి కేసీఆర్ విశాల హృదయంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్నారని మండలి విప్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని వివిధ వార్డుల్లో 87 మందికి కళ్యాణ లక్ష్మి, 10 మందికి సీఎంఆర్ఎస్ చెక్కులను వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన 1500 మంది వివిధ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందగా అందరికీ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశామని తెలిపారు. ఎల్‌వోసీల రూపంలో రూ.8కోట్లకు పైగా లబ్ధిదారులకు అందజేశానన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల పక్షాన రుణపడి ఉంటామని కౌశిక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సల్వాది సమ్మయ్య, వార్డు సభ్యులు తహసీల్దార్ విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ విద్యార్థులకు తీపి కబురు

- స్వదేశీ విద్యానిధి పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలుకు ఆదేశాలు
- ఏటా రూ. 2లక్షల చొప్పున ట్యూషన్ ఫీజు చెల్లింపు
- జిల్లాలో 400కు పైగా మందికి చేకూరనున్న లబ్ధి
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న తల్లిదండ్రులు

కలెక్టరేట్, అక్టోబర్6 : ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వెనుకబడిన తరగతుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇతర రాష్ట్రాల్లో చదువుతూ, ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చెల్లిస్తున్న మాదిరి ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు నిర్ణయించింది. స్వదేశీ విద్యానిధి పేర కొత్త పథకానికి శ్రీకారం చుట్టి, రెండు రోజుల క్రితమే ప్రారంభించింది. దీనిని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేసేందుకు ఆదేశాలు కూడా వెలువరించింది. దీంతో దేశంలోని ఇతర రాష్ట్రాల్లోని పలు విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల ట్యూషన్ ఫీజు ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించనుంది. దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజులను గత ఆరేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తున్నది. వెనుకబడిన వర్గాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులు కూడా ఇతర రాష్ట్రాల్లోని అత్యున్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందుతున్నా, అత్యధికులు ఆర్థిక సమస్యలతో వాటిలో చదవలేకపోతున్నారు. అప్పో సప్పో చేసి వాటిలో అడ్మిషన్లు పొందినా ఫీజులు చెల్లించలేక మధ్యలోనే నిష్క్రమిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన వర్సిటీల్లో ప్రవేశాలు లభించినా, చేరలేక రాష్ట్రంలోనే చదువుతున్నారు. దీనిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల్లోని చురుకైన విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో బీసీలు, ఈబీసీలకు ప్రత్యేకంగా స్వదేశీ విద్యానిధి పథకానికి అంకురార్పణ చేసింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తులు చేసుకునేవారికి ఏటా రూ.2లక్షల వరకు ట్యూషన్ ఫీజు చెల్లించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా స్వదేశీ విద్యానిధి పథకం ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ పథకం ద్వారా జిల్లాకు చెందిన ఇతర రాష్ట్రాల్లో చదువుతున్న 400 మందికి పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జీవీ రామకృష్ణారావు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు
- సదాశివపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 6: విలీన గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పనులను చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లిలో కార్పొరేటర్ ఆకుల పద్మ-ప్రకాశ్‌తో కలిసి రూ.133 కోట్ల సీఎం హామీ నిధుల నుంచి రూ. 85 లక్షలతో మొదటి దశలో 400 మీటర్ల సీసీ రోడ్డు, రోడ్డుకిరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో మౌలిక వసతులుండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. సదాశివపల్లిలో డ్రైనేజీ సమస్య తీరనుందని చెప్పారు. అనంతరం మాజీ సర్పంచ్ కందుకూరి వెంకటస్వామి తల్లి కందుకూరి మల్లమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కొండపల్కలకు చెందిన లింగయ్య ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఇక్కడ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, మానకొండూర్ సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, గ్రామాధ్యక్షుడు కముటం సంపత్, ఆర్బీఎస్ కన్వీనర్ నామాల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు అడప శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ జనగాం శంకర్ గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, నాయకులు కొమ్ముల కరుణాకర్ రెడ్డి, సింగిరెడ్డి సంపత్ రెడ్డి, రామిడి చుక్కయ్య, బోడ నర్సింహారెడ్డి, అట్టెపల్లి శ్రీనివాస్, దాసరి రాజ్ కుమార్, నల్లగొండ తిరుపతి గౌడ్, బండి సంపత్, తోట రమేశ్ ఉన్నారు.